కళారంగానికి తప్పిన కళ


తాళాలు వేసిన థియేటర్

గుడివాడ టౌన్: కళలకు, కళాకారులకు పుట్టినిల్లు అయిన గుడివాడలో కళారంగం అధఃపాతాళానికి పడిపోయింది. ప్రత్యేకించి సినీ రంగం కుదేలుకావడం దీనికి ప్రధాన కారణం. గుడివాడ పట్టణం డివిజన్ కేంద్రం కావడం సుమారు 15 కిలోమీటర్లు పైబడి పరిధిలో సినిమా థియేటర్లు లేకపోవడంతో గతంలో ఇక్కడ సినిమా హాళ్లు ప్రేక్షకులతో కిటకిటలాడేవి. అభిమానుల ప్రోత్సాహంతో ఓ మోస్తరు సినిమా సైతం 50, 100 రోజులు ప్రదర్శించి సంబరాలు చేసుకునేవారు. దేవదాసు, ప్రేమాభిషేకం వంటి చిత్రాలు 365 రోజులు ప్రదర్శన పూర్తి చేసుకోవడంతో అభిమానులు గంభీరంగా ఉత్సవాలు చేసుకునేవారు. 100 రోజులు ప్రదర్శన పూర్తయిన సందర్భంగా అన్న సమారాధనలు చేసిన అభిమానులు కూడా లేక పోలేదు. అట్టి సినీ రంగం నేడు ప్రేక్షకులు లేక సినిమా థియేటర్లు తాళాలు వేసుకునే పరిస్థితికి చేరాయి.

తొలి థియేటర్ శ్రీనివాస

గుడివాడ పట్టణానికి సంబంధించి తొలుత శ్రీనివాస థియేటర్ నిర్మించారు. అక్కడ నేల టికెట్ అంటే నేలే. బెంచీ అంటే బల్లలే. కుర్చీ అంటే ఇనుప మడత కుర్చీలు. ఆ స్థితి నుంచి సినిమాహాళ్ల నిర్మాణం భారీగా చోటుచేసుకున్నాయి. అనంతరం నిర్మించిన గౌరీశంకర్ థియేటర్ సైతం ఇదే విధానాన్ని అవలంభించాయి. అనంతరం నిర్మించిన శరత్ టాకీస్‌లో బాల్కనీ విధానాన్ని అమలులోకి తెచ్చారు. కుర్చీ స్థాయి నుంచి కుషన్ సీట్లు ఏర్పాటు చేశారు. తదనంతరం గంగామహల్, వెంకటేశ్వర థియేటర్, నీలామహల్, బాలాజీ టాకీస్, భాస్కర్ టాకీస్, లక్ష్మీరామ థియేటర్లు అధునాతన వసతులతో నిర్మించారు. భాస్కర్, లక్ష్మీరామ థియేటర్లలో 100 సీట్ల వరకు ఏసీ సౌకర్యం కూడా కల్పించారు. అనంతరం గోపాలకృష్ణ థియేటర్ పూర్తి ఏసీ హాల్‌గా నిర్మించారు. ఇక శ్రీబ్రహ్మ, శ్రీలక్ష్మి, శ్రీరామ జంట థియేటర్ల నిర్మాణాలు సైతం గుడివాడలో కొనసాగాయి. ఏలూరు రోడ్‌లో ఆనంద్ మినీ థియేటర్ కూడా నిర్మించారు. వసతుల లేమి కారణంగా ప్రేక్షకులు రాకపోవడంతో తొలుత శ్రీనివాస థియేటర్, గౌరీశంకర్ థియేటర్లు పూర్తిగా మూసివేశారు. అనంతరం థియేటర్లు పోటాపోటీగా ప్రేక్షకులతో కిటకిటలాడాయి. బ్లాక్ మార్కెట్ సైతం గుడివాడలో మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. కళకలలాడుతున్న కళారంగం ఒక్కసారిగా కుదేలవడం ప్రారంభమైంది. ప్రస్తుతం థియేటర్లు ప్రేక్షకులు లేక సినిమాలు ప్రదర్శించడం ఆపివేసే స్థితికి చేరుకున్నాయి. ఒకప్పుడు పట్టణానికి ప్రధాన ఆదాయం సినీరంగం అయితే ఇప్పుడు కనీస ఆదాయాలు లేని పరిస్థితికి ఈ పరిశ్రమ రావడం విచారకరం. ఒకప్పుడు 15 సినిమా హాళ్లలో రోజుకు నాలుగు ప్రదర్శనలు చేసిన పరిస్థితి నుంచి నేడు కేవలం 10 మంది వచ్చినా ప్రదర్శిస్తామంటూ థియేటర్ యజమానులు చెబుతున్నారంటే ఈ పరిశ్రమ ఎంత కుదేలయిందో అర్థం అవుతోంది. ఇది ఇలా ఉండగా కొన్ని సినిమా హాళ్లు పూర్తిగా తొలగించి వ్యాపార సముదాయాలు, హోటళ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మించారు. కొన్ని సినిమా హాళ్లు ప్రొడ్యూసర్లకు లీజులకు ఇచ్చి యజమానులు చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం పట్టణంలో జి–3 సింధూర, జి–3 భాస్కర్, నెక్సెట్, బొమ్మరిల్లు థియేటర్లు మాత్రమే ప్రదర్శనలు ఇస్తున్నా అవిసైతం ప్రేక్షకులు రాక తాత్కాలికంగా ప్రదర్శనలు నిలిపివేయడం విచారకరం.

కారణాలివే..

గతంలో యాజమాన్యాలు సరైన లెక్కలు చూపకపోవడం, వచ్చిన కలెక్షన్‌లో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను సరిగా కట్టకపోవడంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం థియేటర్ల స్థాయినిబట్టి స్లాబ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి యాజమాన్యాలు సైతం అంగీకరించాయి. అప్పట్లో యాజమాన్యానికి నష్టం రాకుండా కొద్దిమొత్తం స్లాబు నిర్ణయించి, అమలుకు చట్టాన్ని మార్చారు. పెద్ద ప్రొడ్యూసర్లు చిన్న సినిమాలు తీయకపోవడంతో కలెక్షన్‌లు తగ్గడం ప్రారంభమయ్యాయి. దీంతో చిన్న చిన్న థియేటర్ల యాజమాన్యం ప్రదర్శనలు లేక కార్పొరేట్ సంస్థలకు థియేటర్లు అద్దెకు ఇచ్చే సంస్కృతి ప్రారంభమైంది. పెరుగుతున్న విద్యుత్ ధరలు, జీతాలు, సినిమా ఆడితే కలెక్షన్ వచ్చినా రాకున్నా ఒప్పందం ప్రకారం ప్రభుత్వానికి ట్యాక్స్ చెల్లించాల్సి వచ్చింది. దీంతో చిన్న థియేటర్లు పెద్ద థియేటర్ల వారికి అద్దెకు ఇచ్చేశారు. ఇది అదునుగా తీసుకుని పెద్ద నిర్మాతలు, పెద్ద థియేటర్ యజమానులు ఒకే సినిమాను విడుదల నాటి నుంచి 4, 5 రోజులు వారి ఆధీనంలో ఉన్న థియేటర్లలో ప్రదర్శించడం ప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే వారికి ఆదాయం వస్తుంది. ప్రేక్షకులు సైతం ప్రదర్శన తిలకించేస్తున్నారు. దీంతో థియేటర్లు ఖాళీ కావడం ప్రారంభమయ్యాయి.

పైరసీనే ప్రధాన కారణం



సినీ రంగం కుదేలవడానికి పైరసీనే కారణం. అనంతరం వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం పరిశ్రమను ఈ స్థితికి దిగజార్చింది. ప్రొడ్యూసర్లు కేవలం ఆదాయం వైపే మొగ్గుచూపుతున్నారు తప్ప ప్రదర్శన కొనసాగించాలి అనే ఆలోచన లేదు. యూట్యూబ్ చానల్స్‌కు సినిమాలు అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో జనం ఇళ్లలో కూర్చుని సినిమాలు చూస్తున్నారు. థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది.

– పొట్ల శ్రీనివాసరావు, కృష్ణా ఫ్యాన్స్ కార్యదర్శి

క్యాంటిన్ల దోపిడీ



థియేటర్ల ప్రవేశానికి టికెట్ ధర రూ.100 అయితే లోపల వాటర్ బాటిల్ నుంచి కూల్ డ్రింక్, సమోసా, పాప్‌కార్న్ వంటివి విపరీతంగా ధరలు పెంచేశారు. ఒక కుటుంబం సినిమాకు వెళితే రూ. 400 టికెట్ ఖర్చు అయితే రూ.1,000 క్యాంటిన్‌కు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ప్రేక్షకులు భయపడిపోతున్నారు. బయట తినుబండారాలు లోపలకు అనుమతించరు. ఇవన్నీ కర్ణుడి శాపాల్లా తగిలి సినిమా హాళ్లు తాళాలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– చుండూరి శేఖర్, ప్రేక్షకుడు

క్లుప్తంగా

అలరించిన భక్త ప్రహ్లాద నాటకం



ఎలకుర్రు(పామర్రు): ఎలకుర్రు గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి వారి కల్యాణమహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన భక్త ప్రహ్లాద నాటకం ఆహూతులను అలరించింది. వేదాంతం రాధేశ్యామ్ బృందం సభ్యులతో నిర్వహించిన ఈ నాటకం ఆద్యంతం శ్రోతలను మంత్ర ముగ్ధులు చేసింది. నాటకంలోని కొన్ని ఘట్టాలు శ్రోతలను కంట తడిపెట్టించాయి. అనంతరం ఆలయ వంశ పారంపర్యధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు వేదాంతం రాధేశ్యామ్‌తో సహా కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ముదిగొండ శాస్త్రి పాల్గొన్నారు.

విజయం సాధించుకురండి



గుడివాడ టౌన్: క్రికెట్ పోటీల్లో విజయాన్ని సాధించి గుడివాడ ప్రతిష్టను పెంచాలని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. పట్టణానికి చెందిన రెల్లి సంక్షేమ సంఘం గుడివాడ క్రికెట్ క్రీడాకారులకు ఆయన సోమవారం శుభాశీస్సులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రెల్లి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజమండ్రిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కొడాలి నాని బ్యాట్ అందజేసి ప్రోత్సహించారు. ఆడుదాం ఆంధ్రా పోటీల్లో జిల్లా స్థాయి విజయాలు సాధించిన పట్టణ రెల్లి సంఘం క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో సైతం విజయాన్ని సాధించి పట్టణ పేరుప్రఖ్యాతులు ఇనుమడింపచేస్తారని ఆశిస్తున్నామన్నారు.

బీమా చెక్కు పంపిణీ



గుడివాడ టౌన్: ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన బాధిత కుటుంబాలకు ఎంతగానో అండగా ఉంటుందని ఎస్‌బీఐ బజారు బ్రాంచ్ చీఫ్ అసోసియేట్ మేకా ప్రత్యూష అన్నారు. సోమవారం బ్యాంకు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ఖాతాదారుడైన వెన్నా శ్రీనివాసరావు సహజ మరణం చెందారన్నారు. ఏడాదికి రూ. 436 ప్రీమియం చెల్లిస్తున్న ఖాతాదారులందరికి పీఎంజేజేబీవై వర్తిస్తుందని పేర్కొన్నారు. అనుకోకుండా కుటుంబ యజమాని మృతిచెందితే ఆ కుటుంబం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. వాటిలో కొన్ని సమస్యల పరిష్కారానికి ఈ మొత్తాలు ఎంతగానో ఉపయోగపడతాయనే ఆలోచనతో ఈ పథకం అమలు చేస్తున్నారన్నారు. ఏ పరిస్థితిలో మరణించిన వ్యక్తికైనా ఈ పథకం అమలవుతుందని, దీనిని వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కొల్లి శ్రీనివాసరావు, క్యాష్ ఆఫీసర్ పడవల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి విష్ణాలయం సిద్ధం



పామర్రు: స్థానిక విష్ణాలయంలో వైశాఖ మాసం శుద్ధ త్రయోదశి సందర్భంగా మంగళవారం స్వామి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం రాత్రి ఏడు గంటలకు ఆలయ ప్రాంగణంలో రుక్మిణీసత్య భామా సమేత శ్రీవేణుగోపాలస్వామి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి తెలిపారు.

కర్రీ పాయింట్‌లో అగ్ని ప్రమాదం



మొవ్వ: స్థానిక కాలేజ్ రోడ్డులో సోమవారం ఉదయం గ్యాస్ సిలెండర్ లీక్ కావడంతో ఓ కర్రీ పాయింట్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. మొవ్వ ఫైర్ అధికారి(ఇన్‌చార్జి) శ్రీనివాసరావు తెలిపిన కథనం మేరకు మొవ్వకు చెందిన కే సుధాకర్ కర్రీ పాయింట్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఫ్రిజ్, టీవీ, కరెంట్ మీటర్‌తో పాటు పచేరి సామానులు అగ్నికి కాలిపోయాయి. సుమారు రూ.1.25 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. సకాలంలో ఫైర్ సిబ్బంది మంటలు అదుపు చేయటంతో ప్రమాద నష్టాన్ని తగ్గించారు.

ఆర్‌బీకేలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు


పెరికెగూడెం ఆర్‌బీకేలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ వెంకటమణి, ఏఓ జరీనా

మండవల్లి: పెరికెగూడెం రైతు భరోసా కేంద్రంలో సోమవారం సహాయ వ్యవసాయ సంచాలకులు జి వెంకటమణి, మండల వ్యవసాయాధికారి ఎస్‌కే జరీనా సోమవారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. 50 శాతం సబ్సిడీపై పిల్లిపెసర, జీలుగ విత్తనాలను రైతులకు అందజేశారు. ఏడీఏ వెంకటమణి మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవడం వలన నేలలో బలం పెరిగి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఎరువులు వాడకం తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఏఓ ఎస్‌కే జరీనా మాట్లాడుతూ జీలుగ విత్తనాలు కేజీ ధర రూ.88 ఉండగా 50 శాతం సబ్సిడీపై రూ.44కు రైతులకు అందజేస్తామని తెలిపారు. పిల్లిపెసర విత్తనాలు కేజీ పూర్తి ధర రూ.134 ఉండగా 50 శాతం సబ్సిడీపై రూ. 67కు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. జీలుగ విత్తనాలు 10 కేజీల ప్యాకింగ్, పిల్లిపెసర విత్తనాలు ఎనిమిది కేజీల ప్యాకింగ్‌లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పెరికెగూడెం, లింగాల వీఏఏలను సంప్రదించాలని పేర్కొన్నారు. వీఏఏ గోపాల్ పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

పెదపారుపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టీ సీతామహాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో హాజరకావాలని పేర్కొన్నారు.

భారీ వర్షం


పామర్రు కూడలి వద్ద కురిసిన వర్షం


జలమయంగా మారిన బట్టల కొట్టు బజారు


తోట్లవల్లూరులో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

పామర్రు: పామర్రులో సోమవారం ఉదయం 11 గంటల నుంచి భారీవర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. పల్లపు ప్రాంతాలు అన్ని జలమయంగా మారాయి. గఫార్ సెంటర్, బట్టల కొట్టు బజారు, శివాలయం వీధి, బాపూజీ పేట, అరండాల్‌పేట, గాంధీనగరం తదితర ప్రాంతాల్లోని రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. దీంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. పంచాయతీ సిబ్బంది స్పందించి రహదారులపై నిలిచిన నీటిని తొలగించే పనులు చేపట్టారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో సోమవారం వర్షం కుండపోతగా కురిసింది. మధ్యాహ్నం 12 గంటల వరకు ఎండవేడిమి, ఉక్కపోతగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారింది. ఆకాశం మేఘావృతమై చల్లటిగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడటంతోపాటు పల్లపు రోడ్లపై నీరు నిలిచిపోయింది. మొక్కజొన్న రైతులకు వర్షం ఇబ్బందికరంగా మారగా లంకల్లోని చెరకు పైరుకు మాత్రం ఉపయుక్తంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మంటాడ, గురజాడ, రెడ్డిపాలెం, ఫత్తేలంక, గౌడపాలెం, ఐనపూరు, కూడేరు, శ్రీరంగపురం, లంకపల్లి ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాముకాటుకు వృద్ధురాలి మృతి

కొర్నిపాడు(పెదపారుపూడి): పాముకాటుకు వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని కొర్నిపాడు గ్రామంలో సోమవారం జరిగింది. వీఆర్వో దానియేలు కథనం మేరకు గ్రామానికి చెందిన కొలుసు వెంకటేశ్వరమ్మ(65) తన తాటిఆకుల ఇంటిలో వంట చేస్తుండగా నిత్యావసర సరుకుల కోసం చెయి పెట్టి తీస్తుండగా అక్కడే ఉన్న పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను గుడివాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన్నట్లు పేర్కొన్నారు. వెంకటేశ్వరమ్మకు భర్త రంగారావు, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు వీఆర్వో తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తోట్లవల్లూరు: పాములలంకలో ఓ వ్యక్తిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు తోట్లవల్లూరు ఎస్ఐ పి.విశ్వనాథ్ సోమవారం రాత్రి తెలిపారు. గ్రామానికి చెందిన శీలం నాగమల్లేశ్వరరావుపై అదే గ్రామానికి చెందిన మన్నే గోపి ఓ రాయితో ఆదివారం రాత్రి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో నాగమల్లేశ్వరరావు తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


పామర్రులో తాము డ్రాయింగ్ వేసిన బొమ్మలను చూపుతున్న విద్యార్థులు


ముదినేపల్లి గ్రంథాలయంలో నీతికథలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు


పమిడిముక్కల గ్రంథాలయంలో పుస్తక పఠనంలో చిన్నారులు

పామర్రు: గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ద్వితీయశ్రేణి గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ వేసవి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయుక్తం అవుతాయన్నారు. అనంతరం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించినట్లు తెలిపారు. పలు బొమ్మలను వేయించి ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఖో–ఖో పోటీలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం స్థానిక లిటిల్ ఫ్లవర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఉపాధ్యాయుడు పాండురంగారావు విద్యార్థులకు నీతి కథలు, స్పోకెన్ ఇంగ్లిష్ బోధించారు. అనంతరం విద్యార్థులకు క్యారెమ్స్, లూడో, వాలీబాల్ ఆటలు నిర్వహించి గ్రంథాలయాధికారి ఎం.శ్రీదేవి బహుమతులు అందజేశారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని మేడూరు, పెనుమత్స, పమిడిముక్కల, కపిలేశ్వరపురం, గురజాడ శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారం కూడా కొనసాగాయి. ఈ శిబిరాల్లో విద్యార్థులకు ఆటలు, కథల పుస్తకాలు చదివించడం చేస్తున్నారు.

కాశీనాథుని సేవలు నేటి తరానికి ఆదర్శం


అవార్డులను ప్రదానం చేసిన ఉయ్యూరు ఆర్డీఓ రాజు

ఉయ్యూరు ఆర్డీఓ రాజు

ఎలకుర్రు(పామర్రు): కాశీనాథుని సేవలు నేటి తరానికి ఆదర్శం అని ఉయ్యూరు ఆర్డీఓ డి.రాజు పేర్కొన్నారు. మండలంలోని ఎలకుర్రు గ్రామంలోని భ్రమరాంబ చెన్నమల్లికార్జున స్వామి వారి కళావేదికలో విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వదాత అవార్డులు–2024 ప్రదానోత్సవ సభను సోమవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, పాత్రికేయుడిగా, వ్యాపారవేత్తగా, రాజకీయ నేతగా, విద్యాదాతగా, వితరణ శీలిగా వినతికెక్కిన విశ్వదాత.. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు సమాజానికి చేసిన సేవలను నేటి తరం వారు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కాశీనాథుని దాతృత్వాన్ని చూసిన మహాత్మాగాంధీ ఆయన్ను విశ్వదాతగా కితాబిచ్చారని గుర్తు చేశారు. ఆత్మీయ అతిథి, కృష్ణా జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జీవీ పూర్ణచంద్ మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి కళాకారులను కళాభిమానులను గుర్తించి, వారికి తగు విధంగా సముచిత స్థానం కల్పించి సన్మానించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం పలు రంగాల్లో నిష్ణాతులైన వారికి అవార్డులను అందజేశారు.

అవార్డు గ్రహీతలు వీరే

అవార్డు గ్రహీతలు ధర్మవరానికి చెందిన తోలుబొమ్మల కళాకారులు పద్మశ్రీ దళవాయి చలపతిరావు, ప్రముఖ కవి, రచయిత, చారిత్రిక పరిశోధకులు లగడపాటి సంగయ్య, సైకత శిల్పి ఆకునూరు బాలాజీ వరప్రసాదరావు, ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు, విజయవాడ ఆంధ్రపత్రిక కార్యనిర్వాహక సంపాదకురాలు విజయలక్ష్మీ, పెడనకు చెందిన ప్రముఖ సంఘ సేవకులు మట్టా రాధా కృష్ణమూర్తికి విశ్వదాత అవార్డులు ప్రదానం చేశారు. విశ్వదాత కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి కాశీనాథుని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖులు ముదిగొండ శాస్త్రి, గౌరా వెంకటేశ్వరరావు, టీటీడీ ధర్మప్రచారక్ పరిషత్ కో–ఆర్డినేటర్ సీబీకే ప్రసాద్, కోలాటంబృందం గురువు నాగమణి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి


పెనమకూరులో అవగాహన కల్పిస్తున్న సీఐ కిషోర్‌బాబు

తోట్లవల్లూరు: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతిఒక్కరూ నియమావళి తప్పకుండా పాటించాలని పమిడిముక్కల సీఐ ఎం.కిషోర్‌బాబు సూచించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును సీఐ పరిశీలించారు. స్థానికులకు ఎన్నికల నియమావళిపై ఆయన అవగాహన కల్పించారు. ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తుండటంతో ఎవరూ సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదన్నారు. బాణసంచా పేల్చడానికి అనుమతులు లేవన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరూ గొడవలకు దిగవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమై చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

రోగులకు పండ్ల పంపిణీ



కైకలూరు: డయాలసిస్ రోగులకు కైకలూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. చికిత్స పొందుతున్న రోగులను సోమవారంఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు రోగులు మాట్లాడుతూ కైకలూరు డయాలసిస్ కేంద్రం ఏర్పాటు ఎంతో సంతోషకరమన్నారు. ఇందుకు కృషి చేసిన డీఎన్నార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డీఎన్నార్‌తో పాటు ఆయన కుమారుడు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు దూలం శ్యామ్ ఫణికుమార్ ఉన్నారు.

కనులపండువగా వార్షికోత్సవ పూజలు


ప్రత్యేక అలంకారంలో అభయ ఆంజనేయుడు

కోడూరు: మండలంలోని నక్కవానిదారి గ్రామంలో అభయ ఆంజనేయస్వామివారి ద్వితీయ వార్షిక ప్రతిష్టా ఉత్సవాన్ని సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారి మూల మూర్తికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం తులసీదళాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని భక్త బృందాలచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం


ఎమ్మెల్యే డీఎన్నార్‌ను అభినందిస్తున్న నాయకులు

కైకలూరు: అర్హతే ప్రామాణికంగా పార్టీలు చూడకుండా నియోజకవర్గంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్ సీపీ మరో పర్యాయం విజయం సాధించడం ఖాయమని పలువురు నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏలూరు రోడ్ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను పలువురు సోమవారం కలసి పార్టీ విజయంపై మాట్లాడారు. ఆయా మండలాల్లో జరిగిన పోలింగ్ తీరును విశ్లేషించుకున్నారు. డీఎన్నార్‌ను కలసిన వారిలో నాయకులు కొల్లాటి సత్యనారాయణ, చిట్టూరి సత్యనారాయణ, బందా నారాయణ, బొబ్బిలి రత్తయ్యనాయుడు, నున్న భగవానులు, పాము రవికుమార్,, కొదలమ సురేష్, బావిశెట్టి నాగేశ్వరరావు, ఊర శ్రీధర్, కల్యాణ ఉన్నారు.

నేటి నుంచి సోమేశ్వరస్వామి కల్యాణోత్సవం

కలిదిండి: కోరుకొల్లు పార్వతీ సమేత శ్రీ సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మంగళవారం స్వామి, అమ్మవార్లకు అలంకరణ, 22న స్వామివారి దివ్య కల్యాణం, 23న పవళింపు సేవ ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.